నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | NIZAMABAD

## నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి.ఎల్లారెడ్డి మండలంలోని రామలింగం బావి సమీపంలో వర్షం కారణంగా రోడ్డు పైన చెట్టు కొమ్మలు విరిగిపడగా..అగ్నిమాపక సిబ్బంది తొలగించారు. నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలోని గోపాల్‌పేట్ గ్యాస్ గోదాం వద్ద గోడకూలి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో మండల కేంద్రంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


సిరికొండ మండలం గడ్కోల్‌లో వరద ఉధృతికి కూలిన విద్యుత్ స్తంభం

## డెంగ్యూతో మరొకరు మృతి

కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 1: ఉమ్మడి జిల్లాలో డెంగ్యూ కేసుల సంఖ్య పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. విషజ్వరాలతోపాటు డెంగ్యూతో పలువురు మృతి చెందగా.. తాజాగా కామారెడ్డి మండలంలో టేక్రియాల్ గ్రామానికి చెందిన చౌకి సుజిత్ (16) అనే విద్యార్థి డెంగ్యూ బారిన పడి మృతి చెందాడు. చౌకి స్వప్న-స్వామి దంపతులకు సుజిత్ ఒకే ఒక సంతానం. కామారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మెదటి సంవత్సరం చదువుతున్న సుజిత్..వారం రోజుల నుంచి జ్వరంతో బాధపడుతున్నాడు. కుటుంబీకులు ప్రైవేట్ దవాఖానలో చేర్పించగా.. అక్కడ నిర్వహించిన పరీక్షలో డెంగ్యూ నిర్ధారణ కావడంతో చికిత్స చేయించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సుజిత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


గాంధారిలో వంతెనపై నుంచి ప్రవహిస్తున్న ముదెల్లి వాగు

ఉప్పొంగిన వాగులు, వంకలు
గోదావరి, మంజీరాలో ప్రవాహం
ప్రాజెక్టుల్లోకి భారీగా చేరుతున్న ఇన్‌ఫ్లో
నీట మునిగిన పంట పొలాలు
నేలకూలిన నివాస గృహాలు..
పునరావాస కేంద్రాలకు తరలింపు
నేడు విద్యా సంస్థల బంద్
టీయూలో నేటి పరీక్ష వాయిదా


రామేశ్వర్‌పల్లిలోని డబుల్ బెడ్‌రూం ఇండ్లలోకి వర్షపునీరు రావడంతో అందులోఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న ఎస్సై, సిబ్బంది

## పొంగి ప్రవహిస్తున్న వాగులు.. నిలిచిన రాకపోకలు

సిరికొండ నుంచి భీమ్‌గల్ వెళ్లే దారిలో ఉన్న దోండ్ల వాగు వంతెనపై నుంచి వరద పొంగిప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రామారెడ్డి మండలం కన్నాపూర్, రామారెడ్డి గంగమ్మవాగు, రెడ్డిపేట పెద్ద చెరువు, సింగరాయిల్లివాగు అలుగుపారడంతో కామారెడ్డికి రాకపోకల నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లింగంపేట మండలం మోతె పంచాయతీ పరిధిలోని బట్టిప్పగడ్డ తండా సమీపంలోని వాగుకు వరద ఉధృతంగా రావడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నాగారం గ్రామం వద్ద పెద్దవాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాజంపేట్ మండలం గుండారం పెద్ద వాగు, ఎల్లాపూర్ తండా, నడిమి తండా వద్ద ఉన్న వంతెనపై నుంచి వరద నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుడి తండా వాగు ఉధృతికి రాకపోకలు నిలిచిపోయాయి. పాల్వంచ మండలం వాడి, ఫరీద్‌పేట గ్రామాల శివారులో ఉన్న లొట్టివాగు పొంగి ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భిక్కనూరు, అంతంపల్లి మధ్య ఉన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

## కూలిన ఇండ్లు.. పునరావాస కేంద్రాలకు నిరాశ్రయుల తరలింపు

సిరికొండలో ఓ పాత ఇల్లు కూలిపోయింది. పాకాలలో గుడిసె కూలడంతో సామగ్రితో కుటుంబీకులు రోడ్డున పడ్డారు. రామారెడ్డిలోని ఓ కాలనీలోని ఇండ్లలోకి వర్షపు నీరురావడంతో కుటుంబీకులను స్థానిక నాయకులు పునరావాస కేంద్రానికి తరలించారు.లింగంపేట మండల కేంద్రంలో ఒక నివాస గృహం కూలిపోవడంతో నిరాశ్రయులను స్థానిక యువకులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండల కేంద్రంతో పాటు సజ్జన్‌పల్లి గ్రామంలో నివాస గృహాల్లోకి వర్షపు నీరు వచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. రాజంపేట్ మండలంలోని గుండారం గ్రామంలో ఒడ్డె ఎల్లవ్వకు చెందిన గుడిసెలోకి వర్షపు నీరు రావడంతో ఆమె కుటుంబ సభ్యులను అధికారులు పంచాయతీ భవనంలోకి తరలించి పునరావాసం ఏర్పాటు చేశారు.బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామానికి చెందిన ఓ దివ్యాంగురాలు ఆమె కూతురుతో కలిసి ఉంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరగా.. తహసీల్దార్ విఠల్ వారిని బెల్లాల్ పంచాయతీ కార్యాలయంలోకి తరలించారు. రాజంపేట మండలం గుడి తండాలోని ప్రాథమిక పాఠశాల భవనం గోడ కూలింది. మాచారెడ్డి మండలంలోని కాకులగుట్ట తండా గ్రామపంచాయతీ పరిధిలోని రెహమత్‌నగర్ లో నివాసం ఉంటున్న 35 మంది గుడిసెలోకి భారీగా వరద చేరడంతో.. తహసీల్దార్ శ్వేత,ఆర్ఐ మాలిక్ వారిని ఘన్‌పూర్ లోని ప్రాథమిక పాఠశాలకు తరలించారు.

# కుండపోత

## ఉమ్మడి జిల్లాను ముంచెత్తిన వర్షం


పొంగి ప్రవహిస్తున్న పోచారం ప్రాజెక్టు


కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్ గుట్టల మధ్య మత్తడి దూకుతున్న రాళ్లవాగు

నిజామాబాద్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి జిల్లాను వర్షం ముంచెత్తింది. వానకాలం ప్రారంభంలో ముఖం చాటేసిన వానలు ముగింపు సమయంలో దంచి కొడుతున్నాయి. సెప్టెంబర్ నెల ఆరంభంతోనే అతి భారీ వానలు జనాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్, ఎల్లారెడ్డి తదితర పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల ఇండ్లలోకి నీరువచ్చి చేరింది. మాచారెడ్డి మండలంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన కైరం కొండ శివరాములు (55) అనే మత్స్య కార్మికుడు చేపలు పట్టడానికి వెళ్లి గల్లంతు కాగా.. స్థానిక ఎస్సై అనిల్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు. పలు గ్రామాల్లో వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కొన్నిచోట్ల ఇసుక మేటలతో పంట పొలాలు దర్శనమిస్తున్నాయి. అక్కడక్కడా ఏపుగా పెరిగిన వరి పంట నేలకొరిగింది. కామారెడ్డి జిల్లా లింగంపేట మండలంలోని నాగారం గ్రామ శివారులోని పెద్దవాగును కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పరిశీలించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలో ఐదు చోట్ల కుండపోత వాన కురియగా, 25 మండలాల్లో అతి భారీ వర్షపాతం నమోదు కాగా మిగిలిన చోట్ల భారీ నుంచి సాధారణ వర్షపాతం నమోదైంది. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా సిరికొండ మండలం తూంపల్లిలో 11.6సెం.మీ వర్షపాతం నమోదైంది. కామారెడ్డి జిల్లాలో గాంధారి మండలం సర్వాపూర్‌లో 14.4సెం.మీ, గాంధారిలో 12.9సెం.మీ, కామారెడ్డి కలెక్టరేట్‌లో 12.8సెం.మీ, లింగంపేటలో 11.7సెం.మీ చొప్పున రికార్డు స్థాయిలో వానలు కురిశాయి. సోమవారం కూడా ఇదే పరిస్థితి కొనసాగే అవకాశాలున్నట్లుగా వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. పలుచోట్ల రెడ్ అలర్ట్, కొన్ని చోట్ల ఆరెంజ్ అలర్ట్‌ను విడుదల చేసింది. లింగంపేట మండలం మెంగారం, నాగారం శివారులో వరి పంటలోకి నీరు చేరింది. సిరికొండ మండలంలోని తూంపల్లి, పాకాల, చీమన్‌పల్లి గ్రామాల్లో పంట పొలాలు దెబ్బతిన్నాయి.

## ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం

- విపత్కార పరిస్థితిలో ఫోన్లు స్విచ్ఛాఫ్
- బాధ్యత మరిచి పత్తాలేని ప్రత్యేకాధికారులు
- ప్రభుత్వం హెచ్చరించినా పట్టించుకోని వైనం

నిజామాబాద్, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్లు, ఎస్పీలు, రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు 24గంటల పాటు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి. అధికారులు సెలవులు పెట్టొద్దు. లీవ్ అప్లై చేసిన వారు వెంటనే రద్దు చేసుకుని సహాయక పనుల్లో నిమగ్నం కావాలి. ప్రజలకు అండగా నిలవాలి. అత్యవసర విభాగాల అధికారులంతా ఎప్పటికప్పుడు ఫీల్డ్ సమాచారాన్ని ప్రభుత్వానికి అందించాలి...' అంటూ సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఉమ్మడి జిల్లా యంత్రాంగంలో మాత్రం చలనం కరువైంది. ముఖ్యమైన శాఖలకు చెందిన అధికారులంతా ఆదివారం కావడంతో పత్తాలేకుండా పోయారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితిని వాకబు చేసినప్పటికీ మండలాల్లో స్థానిక ప్రజా ప్రతినిధుల స్థానంలో నియామకమైన ప్రత్యేక అధికారులు మాత్రం ఎక్కడా కనిపించలేదు. క్షేత్ర స్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాల తీరు తెన్నులపై పరిశీలన చేయలేదు. ప్రజలకు భరోసా కల్పించలేదు. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 359 చెరువులు అలుగులు పోస్తున్నందున ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. వర్షాల మూలంగా వరద ఉధృతి పెరగడంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఆగమాగమవుతున్నారు. వారికి అండగా నిలిచే వారే కరువయ్యారు. కామారెడ్డి శివారులో జాతీయ రహదారి 44 ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు రూపు కోల్పోయింది. భారీ వానకు కుంగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తితే పట్టించుకునే వారు లేకుండా పోయారు. చాలా చోట్ల రోడ్లు తెగి రాకపోకలకు ఆటంకాలు ఏర్పడితే రోడ్లు, భవనాల శాఖ, పంచాయతీ రాజ్ ఇంజనీర్లు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకున్నారంటూ జనాలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నిండుకుండల్లా ప్రాజెక్టులు

మోర్తాడ్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి రూరల్, సెప్టెంబర్1: భారీ వర్షాలతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు నిండుకుండల్లా మారాయి. ఎస్సారెస్పీకి వరద పెరిగింది. ఆదివారం ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్ట్‌లోకి 60,419 క్యూసెక్కుల వరద చేరింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ఆదివారం ప్రాజెక్ట్‌లో 1086.3 అడుగుల (64.036 టీఎంసీలు) నీటినిల్వ ఉన్నది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఫ్లడ్‌ఫ్లో కెనాల్ హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఎత్తివేసి 1500క్యూసెక్కుల నీటిని వదిలినట్లు ప్రాజెక్టుల అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఆదివారం రాత్రి తొమ్మిది గంటల వరకు 28,900 క్యూసెక్కుల వరద వచ్చి చేరిందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1405.00 అడుగులకు గాను(17.802 టీఎంసీలు), 1393.30 అడుగులు (5.731 టీఎంసీలు) గా నిల్వ ఉందని ఆయన వివరించారు. సింగితం రిజర్వాయర్‌లోకి 10,500 క్యూసెక్కుల వరద వస్తుందని, నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి 500 క్యూసెక్కులు, మంజీరా నదిలోకి పది వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తోంది. పూర్తి స్థాయి నీటి మట్టానికి 1464 ఎంసీఎఫ్‌టీ (1.82 టీఎంసీలు) చేరుకొని అదనంగా 18 ఈంచుల నీరు పొంగి పొర్లుతున్నది. దీంతో 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్న సీఈ శ్రీనివాస్ తెలిపారు. కల్యాణి ప్రాజెక్టు నిండు కుండా మారింది. దీంతో అధికారులు మూడు రేడియల్ గేట్లను ఆదివారం ఉదయం ఎత్తివేశారు. 2వేల 150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, మూడు రేడియల్ గేట్ల ద్వారా 2వేల క్యూసెక్కులను మంజీరా నదిలోకి వదులుతున్నారు. 150 క్యూసెక్కుల నీటిని నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి మళ్లించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 409.50 మీటర్లు కాగా ప్రస్తుతం 408.50 మీటర్లకు చేరుకున్నది.

## నేడు విద్యాసంస్థల బంద్

ఖలీల్‌వాడి/ కామారెడ్డి రూరల్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ మేరకు కామారెడ్డి కలెక్టర్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, నిజామాబాద్ డీఈవో దుర్గా ప్రసాద్ ఆదివారం వేర్వేరుగా ప్రకటనల్లో తెలిపారు. ఆదేశాలను అమలు చేయాలని వారు సూచించారు.

**టీయూలో పరీక్ష వాయిదా**

డిచ్‌పల్లి, సెప్టెంబర్ 1 : భారీ వర్షాల కారణంగా టీయూ పరిధిలో నేడు నిర్వహించనున్న థియరీ, ప్రాక్టికల్ పరీక్షలను వాయిదా వేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి జరిగే పరీక్షలు యథావిధిగా జరుగుతాయని పేర్కొన్నారు.


అలుగుపారుతున్న కామారెడ్డి పెద్దచెరువు


లింగంపేట మండలం నాగారం వంతెన పై నుంచి ప్రవహిస్తున్న వరద



భారీ వర్షానికి కొట్టుకు పోయిన భిక్కనూరు నుంచి అంతంపల్లికి వెళ్లే రోడ్డు

## తప్పనిసరి అయితే తప్పా బయటికి రావొద్దు

### బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



మోర్తాడ్, సెప్టెంబర్1: జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గడిచిన నాలుగేండ్లుగా బాల్కొండ నియోజకవర్గంలో భారీ వర్షాలు కురిసినందున గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. భారీ వర్షాలకు మొదటగా ఇబ్బంది పడే ప్రాంతాలను గుర్తించి అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పాత ఇండ్లు, భవనాలు ఉంటే ప్రజలకు అవగాహన కల్పించి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సారెస్పీ పూర్తిగా నిండి వరదను గోదావరిలోకి వదిలే పరిస్థితి తలెత్తితే గోదావరి పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. స్థానికంగా ఉండే బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండి అవసరం ఉన్నచోట ప్రజలకు సహాయం చేయాలని వేముల పిలుపునిచ్చారు.


సిరికొండలో కూలిన పాత ఇల్లు

## భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

కంఠేశ్వర్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. ఆదివారం డీజీపీ జితేందర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులతో కలిసి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, ఎస్పీలతో వరద ప్రభావిత పరిస్థితులపై సమీక్షించారు. మరో రెండు రోజులు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని, ఎక్కడా ప్రాణ నష్టం సంభవించకుండా ముందస్తుగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడకూడా ప్రజలకు ఇబ్బంది తలెత్తకుండా అధికార యంత్రాంగం సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. వీసీలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, పాల్గొన్నారు.


లింగంపేట మండలం నాగారం వంతెన వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్